క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో మండల పూజ


ప్రత్యేకాలంకారంలో అరుణాచలేశ్వరస్వామి

సదుం: మండలంలో జాంగ్రెపేటలోని అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తిప్రపత్తులతో మండల పూజ నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన చేసి చేసి 40 రోజులు పూర్తయి న సందర్భంగా ఆల య ధర్మకర్త సురేంద్రరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకాలంకారంలో ఉన్న స్వామి వారిని భక్త లు దర్శించుకున్నారు. రాత్రి బూరగమందకు చెందిన భజన బృందం భజనలు చేసింది. భక్తులకు అన్నదనం చేశారు. స్వామి వారిని పలువురు పార్టీ నాయకులు, భక్తులు దర్శించుకున్నారు.

అప్రెంటిస్‌షిప్‌కు 38మంది ఎంపిక


మేళాను ప్రారంభిస్తున్న ఐటీఐ ప్రిన్సిపాల్ నగేష్

శాంతిపురం: స్థానిక ఐటీఐలో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాకు 81 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టైటాన్, భారామతి ఆగ్రోస్, అమ్మ చారిటబుల్ ట్రస్ట్, అమరరాజా బ్యాటరీస్ సంస్థలలో అప్రెంటిస్‌షిప్‌కు 38 మంది ఎంపికయ్యారు. ఆయా సంస్థల ప్రతినిధులతో పాటు ప్రిన్సిపల్ నగేష్, చిత్తూరు ఐటీఐ కరస్పాండెంట్ హేమంత్ కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ హెచ్‌ఎంకు సన్మానం


హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పులిచెర్ల(కల్లూరు): ఉత్తమ హెచ్‌ఎంలను ఇటీవల కడప ఆర్జేడీ కార్యాలయంలో సన్మానించారు. కల్లూరు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీవాణి కూడా సన్మానగ్రహీతల్లో ఒకరు. ఈ నేపథ్యంలో సోమవారం సహచర ఉపాధ్యాయులు ఘనంగా ఆమెను సన్మానించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తుసామగ్రి వితరణ


వస్తుసామగ్రి అందజేస్తున్న సీతారామయ్య

పలమనేరు: మండలంలోని ఎనిమిది అంగన్‌వాడీ సెంటర్లకు అవసరమైన స్టౌలు, కుక్కర్లు, పిల్లలకు గ్లాసులు, జాతీయ నాయకుల చిత్రపటాలను పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు శ్రీపురం సీతారామయ్య సోమవారం వితణ చేశారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, సూపర్‌వైజర్ ద్రాక్షాయణి, వర్కర్లు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెంగమ్మ, ఏరియా ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, జరావారిపల్లె, పందేరుపల్లె, కాబ్బల్లె, దొడ్డిపల్లె, కూర్మాయి, ముడివారిపల్లె, జల్లిపేట, వెంకటేష్‌పురం కాలనీకి చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

పలమనేరులో భారీ వర్షం


నాగమంగళం వద్ద ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ముఖ్యంగా పట్టణ సమీపంలోని నాగమంగళం వద్ద బెంగళూరు–చెన్నై హైవేపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మూడు రోజులకు ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు వర్షం మూలాన వాతావరణం చల్లబడి ఉపశమనం కలిగించింది.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

పుంగనూరు: పట్టణంలోని ట్రావెలర్స్ బంగ్లాలో సోమవారం కరాటే పోటీలు నిర్వహించారు. 75 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్రౌన్, బ్లాక్ పోటీలను స్థానిక పులినాడు కరాటే అకాడమి, బూడోఖాన్ నిర్వహించింది. ఈ పోటీలలో షబిల్, దౌలత్ బ్లాక్ బెల్ట్ సాధించారు. మిగిలిన విద్యార్థులు బ్రౌన్, ఆరెంజ్, ఎల్లో బెల్టులను సాధించి మెడల్స్ పొందారు. కరాటే మాస్టర్లు రెడ్డిమహేష్, కేశవ, సదాశివ పాల్గొన్నారు.

వంకలు, చెరువులపై పడ్డ

ఇసుకాసురులు!

- నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక రవాణా
- అడవుల్లోని వాగులు, వంకలనూ వదలని వైనం
- చెరువుల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
- సంబంధం లేదన్నట్టు వ్యవహరిస్తున్న సెబ్ అధికారులు


పెద్దపంజాణి మండలంలోని కౌండిన్య నదిలోకి వాగుల్లో ఇష్టానుసారంగా తవ్వేసిన ఇసుక మేటలు

పలమనేరు: ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలకు ఇసుక డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో దీనిని అవకాశంగా తీసుకుని ఇసుకాసురులు ప్రభుత్వ చెరువులు, వంకలు, కాలువలు, నదులను చెరబడుతున్నారు. మరోవైపు ఇసుక వ్యాపారులు కృత్రిమ డిమాండ్ సృష్టించి వారి జేబులు నింపుకుంటున్నారు. నియోజకవర్గంలో ప్రధానంగా ఇసుక లభించే కౌండిన్య నదిలో ఎక్కడబడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. నీరున్నప్పటికీ ఇసుకను సైతం జేసీబీలతో తీసి ట్రాక్టర్లకు నింపుతున్నారు. గతంలో కురిసిన వర్షాలకు నియోజకవర్గంలోని వాగులు, వంకలు ప్రవహించాయి. దీంతో వాగుల్లో ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వీటిపై ఇసుకాసురుల కన్ను పడింది.

చెరువులు నాశనం

సమీపంలోని చెరువుల్లో నీరు తగ్గిన ప్రాంతాల్లో ఇసుకను తవ్వుతున్నారు. ముఖ్యంగా బైరెడ్డిపల్లె పెద్ద చెరువులో అక్కడి ఇసుకాసురులే కాకుండా బయటి వ్యక్తులు సైతం రోజూ ట్రాక్టర్లు, జేసీబీలు, కూలీలతో రావడం ఎక్కడ ఇసుక కనిపిస్తే అక్కడ తవ్వి ఇసుకను పట్టపగలే తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సెబ్ అధికారులు వీటిని పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఇక పెద్దపంజాణి మండలంలోని కౌండిన్యలో ఎటుచూసినా ఇసుక తవ్వకాల మూలాన ఏర్పడిన గోతులే కనిపిస్తున్నాయి. పలమనేరు పట్టణ సమీపంలోని నాగమంగళం, క్యాటిల్‌ఫామ్‌ల వద్ద నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ఇసుక తరలుతూనే ఉంది. ప్రధానంగా ఇక్కడి హైవేపై ఇసుకతో ట్రాక్టర్లు వెళుతున్నా పోలీసులు, రెవెన్యూ, సెబ్, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇసుకను తరలించే హైవేలోనే ఇరిగేషన్, ఆర్టీఓ, తహశీల్దార్ కార్యాలయాలు, కోర్టు, పోలీసు స్టేషన్ మొదలైనవి ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెట్టే విషయంలో ఇప్పుడు తమకు సంబంధం లేదని, సెబ్‌అధికారులు మాత్రమే చూడాలని మిగిలిన శాఖల అధికారులు చెబుతుండడం గమనార్హం! ఇదే విషయమై స్థానిక సెబ్ అధికారులను ప్రశ్నిస్తే.. తమకు కర్ణాటక మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకే సమయం సరిపోవడం లేదని..ఇక ఇసుక అక్రమ రవాణా కట్టడి విషయం కూడానా!? అని పెదవి విరుస్తుండటం విశేషం!


బైరెడ్డిపల్లె పెద్ద చెరువు నుంచి వెళుతున్న ఇసుక ట్రాక్టర్

మోటార్ సైకిళ్లు ఢీ : ముగ్గురికి గాయాలు



గాయపడిన కేశవరెడ్డి, సుధాకర్ ఆచారి

రొంపిచెర్ల: ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన తిరుపతి–మదనపల్లె జాతీయ రహదారిలోని బండకిందపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. రేణిగుంట మండలం బుగ్గవీధికి చెందిన కార్పెంటర్ సుధాకర్ ఆచారి(52) కలికిరి నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, మండలంలోని బోనంవారిపల్లెకు చెందిన కేశవరెడ్డి(49), సొరకాయలు(73) మోటార్ సైకిల్‌లో పీలేరుకు వెళుతూ బండకిందపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఢీకొన్నారు. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం అన్నమ్మయ్య జిల్లా పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేశవరెడ్డి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. సుధాకర్ ఆచారికి తలలో 6 కుట్లు పడ్డాయి. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎస్‌ఐ కృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11న వైద్య శిబిరం

పుంగనూరు: మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఈ నెల 11న వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు సరళ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ శివ విలేకరులకు తెలిపారు. పట్టణంలో జ్వరాలు ప్రబలుతుండడంతో ముందుజాగ్రత్తగా సచివాలయ వలంటీర్లతో ప్రతి ఇంటికీ హోమియో మందుల పంపిణీకి పూనుకున్నట్టు చెప్పారు. మున్సిపాలిటీలోని 31 వార్డులలో దాదాపు 60 వేల మందికి మందులు పంపిణీ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కుప్పం: పట్టణంలో బీఆర్‌డి క్లినిక్ మెదటి సంవత్సర వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరం బట్టి కొందరికి మందులు పంపిణీ చేసినట్లు క్లినిక్ అధినేత డాక్టర్ సురేష్ తెలిపారు.



మయూర వాహనంపై విహరిస్తున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, విశేష అలంకరణలో సుబ్రమణ్యస్వామి

మయూర వాహనంపై విహారం

- కనుల పండువగా సోమవారోత్సవం
- భక్తులతో కిక్కిరిసిన వల్లీదేవసేనుడి ఆలయం

రామకుప్పం: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారం సోమవారోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలోని వేంకటేశ్వరస్వామి, పద్మావతి, శనీశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవల్లీదేవసేన సమేతుడై సుబ్రమణ్యస్వామి మయూర వాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరించారు. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలలో బారులు తీరారు. స్వామివారికి ప్రాకారోత్సవాలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. కావడులు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామకుప్పం పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.


ఆలయ పరిసరాల్లో భక్త జన సందోహం

అంబేడ్కర్ విగ్రహానికి స్టీల్ బ్యారికేడ్లు


అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేస్తున్న స్టీల్ బ్యారికేడ్లు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డుపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్టీల్ రాడ్లతో బ్యారికేడ్ల ఏర్పాటుకు పూనుకున్నారు. సోమవారం డీఈఈ మహేష్ ఆధ్వర్యంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, జాతీయ రహదారిపై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వాహనాల కారణంగా ఇబ్బంది కలుగుతోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని విగ్రహానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా స్టీల్ బ్యారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. అలాగే గత వారం విగ్రహానికి నలువైపులా పిల్లర్లు, రంగురంగుల ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. విగ్రహ ప్రాంతంలో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండడానికి ఈ పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

‘జగనన్న సురక్ష’తో ఆరోగ్యం పదిలం




పుంగనూరు : సుగాలిమిట్టలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు కిషోర్, సల్మా తదితరులు



వి.కోట వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న అమరనాథ్, పులిచెర్ల : ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో..

పుంగనూరు: గ్రామీణ ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సుగాలిమిట్టలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మెడికలాఫీసర్ డాక్టర్ సల్మా ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ మాధవి, చర్మవ్యాధుల నిపుణులు డాక్టర్ కిషోర్, మండల పీహెచ్‌పీల డాక్టర్లు సృజన, తేజశ్విని, కిరణ్మయి, సిబ్బంది 4 బృందాలుగా వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 235 మందిని పరీక్షించారు. మధుమేహం, రక్తపోటు 60 మందికి ఉన్నట్టు గుర్తించారు. 30 మందికి వ్యాధి నిర్ధారణ చేసి మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ సల్మా మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 7 శిబిరాలు నిర్వహించి 1,674 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. ప్రతి ఒక్కరికీ వ్యాధిని బట్టి రక్త పరీక్షలు చేసి మందులు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ శిబిరాలతో గ్రామీణ ప్రాంతాలలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స చేయడం సులభతరమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నారాయణ, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చెంగారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

316 మందికి వైద్య సేవలు

సదుం: మండలంలోని పాలమంద సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో డాక్టర్లు సోమేశ్వరెడ్డి(జనరల్ సర్జన్), సుబ్రమణ్యం(జనరల్), సుచిత, చరణ్, ఆప్తమాలజిస్ట్ పెంచలయ్య ఆధ్వర్యంలో 316 మందిని పరీక్షించారు. మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మాధవి, సూపర్ వైజర్లు నీలకంఠ, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో 125 మందికి..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 125మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రోగులను డాక్టర్లు వినాయక, షమ, సుష్మ, శ్రీనివాస్ తదితరులు పరీక్షించారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, గోవిందరెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.


పెద్దపంజాణి : వైద్యపరీక్షల కోసం వేచివున్న ప్రజలు

రొంపిచెర్లలో 610 మందికి..

రొంపిచెర్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 610 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ దినేష్ కుమార్ నాయక్ తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన పౌష్టికాహార వంటకాలను రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర, వైద్యులు రిజ్వాన్, హరిప్రియ, ఎంపీటీసీలు సిరాజున్నీసా, రహీమాబీ, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు గీతాశ్రీ, భారతి, ఆరోగ్య కార్యకర్తలు గాయత్రి, వెంకటేశ్వరి, సుమిత్ర, వార్డు సభ్యులు లక్ష్మయ్య, చిన్న నాగరాజ, రాజాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు నియోజకవర్గం

మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

వి.కోట: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లా సాంఘిక సంక్షేమ, సామాజిక సేవా సలహాదారుడు అమరనాథ్ అన్నారు. సోమవారం మండలంలోని బోయచిన్నాగనపల్లెలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని, అలాగే శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను సింగిల్‌విండో చైర్మన్ గోపిరెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. వృద్ధులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సులోచన, ఎంపీటీసీ అంజలి, డాక్టర్ రాజేష్, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

245 మందికి..

పెద్దపంజాణి: మండలంలోని తొలిశమ్మగుడి ఎంపీయూపీ పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 245 మందికి వైద్యాధికారులు మురళీకృష్ణ, రెడ్డిహేమంత్, శ్రీనివాస్, మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ముగ్గురిని ఆరోగ్యశ్రీకి రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు రుద్రమూర్తి, భాస్కర్, ఎంపీటీసీ గురుమూర్తి, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఎంఈఓలు గోపాల్ రెడ్డి, తులసీరాం, డీటీ ఫణికుమార్, ఈఓపీఆర్ఆర్డీ శారదాదేవి,హెచ్‌ఎం హరిప్రసాద్, ఉపాధ్యాయులు వినాయక, ఎంఆర్సీ సుధాకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

238 మందికి వైద్యపరీక్షలు


చిరుధాన్యాల ఆహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గుడుపల్లె: మండలంలోని కనమనపల్లెలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కుప్పం ఏరియా ఆస్పత్రి వైద్య బృందం మొత్తం 238మందికి వైద్య పరీక్షలు చేసింది. మందులు పంపిణీ చేసింది. శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఆ స్టాళ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు యశ్వంత్‌రెడ్డి, డిల్‌ఫిన్, తహసీల్దార్ గురప్ప, ఈఓపీఆర్‌డి శంకర్, పార్టీ మండల కన్వీనర్ రామక్రిష్ణ, నాయకులు శంకర నారాయణ తదితరులు పాల్గొన్నారు.



రొంపిచెర్ల : రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లు


సదుం: కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

